క్లుప్తంగా

బడుగుల సంక్షేమం బీఎస్పీతోనే సాధ్యం



ప్రచారంలో ఉష

పెద్దపల్లిరూరల్: బడుగు, బలహీనవర్గాల ప్రజలకు, రైతాంగ సంక్షేమం బీఎస్పీ పాలనతోనే సాధ్యపడుతుందని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వల గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనంతా అవినీతిమయమైందని ఆరోపించారు. పేదలకు సంక్షేమ పథకాలు అందకపోగా ఇష్టానుసారంగా పెరిగిన ధరలు, పన్నులతో మోయలేని ఆర్థికభారం పడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించి బహుజన సమాజ్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. నాయకులు దుర్గయ్య, గోపాల్‌యాదవ్, అనిల్, రియాజ్, రామిండ్ల శారద, రంజిత్, కొమురయ్య, రవికుమార్ పాల్గొన్నారు.

కిరాణ వర్తకుల సమస్యలు పరిష్కరించాలి

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ పట్టణ, మండల కిరాణ వర్తకుల సమస్యలు పరిష్కరించాలని కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ కోరారు. సుల్తానాబాద్ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన విజేందర్‌ను శనివారం కలిసి విన్నవించారు. అనంతరం ఎస్సైని సన్మానించారు. కార్యదర్శి రవీందర్‌గౌడ్, కోశాధికారి సత్యం, సభ్యులు మహేందర్, శ్రీనివాస్, నాగరాజు, రమేశ్, నగేష్, రాజు, భాస్కర్, రాఘవులు, మొండయ్య పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కలు పంపిణీ

కమాన్‌పూర్: మండలంలోని సిద్దిపల్లె గ్రామంలో తొమ్మిదో విడత హరితహారం పథకంలో భాగంగా ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. సర్పంచ్ తాటికొండ శంకర్, ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, ఉపసర్పంచ్ జాబు సతీశ్, ఎంపీవో శేషయ్య సూరి, ఏపీవో మల్లేశ్వరి, కార్యదర్శి వికాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెట్లపొదలు తొలగించారు



పాఠశాల ఎదుట చెట్లపొదల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

కమాన్‌పూర్: రామగిరి మండలం పన్నూర్ శివరాంనగర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, చెట్ల పొదలను తొలగించారు. ఈ నెల 11న 'సాక్షి'లో పాఠశాల చుట్టూ చెట్లపొదలు అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో పంచాయతీ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలు, చెట్లపొదలు తొలగించారు.

ఆర్థికసాయం అందజేత



పరామర్శిస్తున్న నల్ల మనోహర్‌రెడ్డి

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టకు చెందిన బొడిగె గంగ(32)కు గర్భసంచిలో ఇన్‌ఫెక్షన్ ఏర్పడటంతో తప్పనిసరి పరిస్థితుల్లో కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ఆపరేషన్ చేశారు. వారి పరిస్థితి తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, నల్ల ఫౌండేషన్ అధ్యక్షుడు నల్ల మనోహర్‌రెడ్డి ఆసుపత్రికి వచ్చి ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి బిల్లు తక్కువ చేయించి, రూ.5వేలు అందజేశారు.ఈ విషయం నానేస్తం ట్రస్టు సభ్యులకు విషయం తెలపగా వెంటనే స్పందించి రూ.10,016 ఆసుపత్రికి వచ్చి నగదు అందజేశారు. నానేస్తం ట్రస్టు అధ్యక్షుడు పెంట శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంగళదాసు అశోక్, పూర్వ అధ్యక్షులు కట్ల సత్యం, వీరగోని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



ఉత్సవాలకు హాజరైన సునీల్‌రెడ్డి

కమాన్‌పూర్: ముత్తారం మండలంలోని సీతంపేటలో శనివారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఎంపీపీ జక్కుల ముత్తయ్య, సర్పంచ్ పులిపాక నగేష్, ఉప సర్పంచ్ జక్కుల ఓదెలు, మాజీ సర్పంచ్ గంగుల రాజలింగు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటరాజం, నాగరాజు, సుధీర్, ప్రవీణ్, అజయ్, వినయ్ పాల్గొన్నారు.

బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పాలి

- గరంగరంగా మండల సమావేశం
- సమస్యలపై ప్రశ్నించిన సభ్యులు
- అవమానిస్తున్నారని సభను బహిష్కరించిన మహిళా ఎంపీటీసీలు



ప్రశ్నిస్తున్న సర్పంచ్ నర్సింహయాదవ్

జూలపల్లి: చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని, బిల్లులు ఎప్పుడు ఇస్తారో స్పష్టం చేయాలని, ఈజీఎస్ ద్వారా తెలంగాణ క్రీడా ప్రాంగణాల పనులు పూర్తి చేసినా.. పూర్తి బిల్లులు ఎందుకు రావడంలేదని సభ్యులు ముక్తకంఠంతో ప్రశ్నించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ మొగురం రమేశ్ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. కుమ్మరికుంటలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సరిపడా టీచర్లను కేటాయించలేదని ఎంపీటీసీ తమ్మడవేని మల్లేశ్ యాదవ్ సభ దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాలలను ఎందుకు పర్యవేక్షించడం లేదని ప్రశ్నించారు. జిల్లా కేంద్రం నుంచి జూలపల్లికి డబుల్‌రోడ్డు మంజూరైనట్లు ప్రకటించారని, కానీ అది ఉత్తదేనని తమకు సమాచారం ఉందని, రోడ్డు సంగతి తేల్చాలని జూలపల్లి సర్పంచ్ నర్సింహయాదవ్ డిమాండ్ చేశారు. రైతులకు ఎస్సారెస్పీ నీటి విడుదలపై ముందుగా సమాచారం ఇవ్వాలని వైస్ ఎంపీపీ ఏఈ ప్రశాంత్‌కు సూచించారు. మండల సభకు అన్ని శాఖల ఆధికారులు రాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సభను బహిష్కరించిన మహిళా ఎంపీటీసీలు..

మండల సమావేశాల్లో మహిళా ఎంపీటీసీలకు తగిన గౌరవం ఇవ్వడంలేదని ఆరోపిస్తూ నిరసనగా ఎంపీటీసీలు మండల సభ బహిష్కరించారు. పల్లె స్వరూప(వెంకట్రావుపల్లె), గొట్టిముక్కుల రజనీ(పెద్దాపూర్), అమరగాని మమత(జూలపల్లి), శ్రీలత (కాచాపూర్) బహిష్కరించగా వీరికి మద్దతుగా అబ్బాపూర్ ఎంపీటీసీ దండె వెంకటేశం సభ నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, డిప్యూటీ తహసీల్దార్ అబూబాకర్, ఎంపీటీసీలు కత్తెర్ల శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు లాల్ మహ్మద్, సర్పంచులు సంతోశ్‌రావు, వీర్ల మల్లేశం, ఎల్లయ్య, వీరయ్య, తిరుపతి, రాజయ్య, మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, ఏవో ప్రత్యూష, ఉద్యాన శాఖ ఏవో జ్యోతి పాల్గొన్నారు.



సభను బహిష్కరిస్తున్న ఎంపీటీసీలు

మల్టీపర్పస్ విధానం వెంటనే రద్దు చేయాలి



మోకాళ్లపై కూర్చుని కార్మికుల నిరసన

పెద్దపల్లిరూరల్: పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం 10రోజులుగా చేస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీమన్నారాయణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, నాయకులు లచ్చయ్య, రాజబాబు, గట్టయ్య, గౌసోద్దీన్, సంపత్, దేవేందర్, శ్రీనివాస్, ముస్తఫా ఉన్నారు.

కమాన్‌పూర్: రామగిరి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కార్మికులు చేస్తున్న సమ్మెకు బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. నాయకులు శ్రీనివాస్, రాజు, తిరుమల, చక్రి, రమేశ్ ఉన్నారు.

జూలపల్లి: పంచాయతీ కార్మికుల,ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె శనివారంతో పదోరోజుకు చేరింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు దీక్షా శిబిరంలో గ్రామాల నుండి వచ్చిన కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. సమ్మెలో కార్మిక సంఘం అధ్యక్షుడు సంపత్‌కుమార్, గౌరవాధ్యక్షుడు బాణయ్య, నాగయ్య, భాస్కర్, పురుషోత్తం ఉన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయం ఎదుట జీపీ ఉద్యోగ, కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 10వ రోజుకు చేరగా ఈసందర్భంగా జీపీ, ఉద్యోగ కార్మికులు మాట్లాడుతూ తమసమస్యలు ప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జీపీ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఇరుగురాల లచ్చయ్య, కార్యదర్శి ఎండీ.ఖాజ, కవ్వంపల్లి దేవయ్య, మండల అధ్యక్షులు తీట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆసంపల్లి చంద్రయ్య, నాయకులు కొండయ్య, మొగిలి, నర్సయ్య, సత్యనారాయణ, కోండ్ర నర్సయ్య, చిరంజీవి, 40మంది కార్మికులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జీపీ కార్మికులు దీక్ష కొనసాగించారు. యూనియన్ మండల అధ్యక్షుడు కలవేన గట్టయ్య, నాయకులు రాజబాబు, సంపత్, గౌసుద్దీన్, సురేశ్, లక్ష్మణ్, మధునయ్య, అంజి, కుమార్, రామస్వామి, లక్ష్మి, ఓదెమ్మ పాల్గొన్నారు.

కారు దిగి.. కారెక్కిన శంకర్‌నాయక్



ఎమ్మెల్యేతో చర్చల్లో శంకర్‌నాయక్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 15వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్ శుక్రవారం బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్ యూనియన్ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు ప్రకటించి శనివారం తిరిగి కారు ఎక్కారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం తన నివాసంలో జరిపిన చర్చలో శంకర్ నాయక్ మాట్లాడారు. టీబీజీకేఎస్ యూనియన్‌లో ఉన్న లుకలుకలతో మనస్థాపానికి గురై బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేశానని, ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో ఎలాంటి వ్యతిరేకత లేదని తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నానని స్పష్టం చేశారు. ఎప్పుడూ ఎమ్మెల్యేతోనే ఉంటానని ప్రకటించారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్ తాళ్ల అమృత రాజయ్య నాయకులు ఉన్నారు.

బదిలీ అయిన అధికారులను కలిసిన కమిషనర్లు



సుల్తానాబాద్: కలెక్టర్ డాక్టర్ సంగీత, అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ బదిలీపై వెళ్తున్న విషయం విదితమే. పెద్దపల్లి, సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్ వారిని కలిసి మొక్క అందించి సన్మానం చేశారు.

కార్మికులకు గ్యాస్ సిలిండర్ ఉచితంగా రవాణా చేయాలి

జ్యోతినగర్: సింగరేణి కార్మిక కుటుంబాలకు వంటగ్యాస్ ఉచిత రవాణా చేయాలని ఆర్జీ–1 జీఎంకు సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్జీ–1 పరిధిలో గ్యాస్ సరఫరా చేసే ప్రక్రియలో గోడౌన్ నుంచి కార్మిక కుటుంబాలకు ఉచిత రవాణా నిబంధన ఉన్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ ఒక్కో సిలిండర్‌కు రూ.50 వసూలు చేస్తున్నారని, వసూలును అరికట్టి అతడిపై చర్య తీసుకోవాలని కోరారు. కార్మిక కుటుంబాలకు సరఫరా చేసే నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలని కోరారు. కార్మికుల పక్షాన సమస్యల పరిష్కారం కోసం యూనియన్ పోరాడుతుందని, కార్మికులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ కార్పొరేషన్ అధ్యక్షుడు కోటగిరి పాపయ్య, ప్రధాన కార్యదర్శి సంగెపు రాజు, పెద్దపల్లి పార్లమెంటరీ అధికార ప్రతినిధి రాజయ్య, రవీందర్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన

మంథని: మంథని సాంఘిక సంక్షేమ బాలుర విద్యార్థులకు ర్యాగింగ్ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. మంథని కోర్టులో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి ఇ.భారతి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న యాకయ్య

పెద్దపల్లిరూరల్: ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం సాగిద్దామని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య పిలుపునిచ్చారు. పెద్దపల్లిలో శనివారం ఏరియా కమిటీ ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యలు గుర్తించి నిరంతర పోరాటం చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీ కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. నాయకులు ఎరవెల్లి ముత్యంరావు, సీపెల్లి రవీందర్, కల్లెపల్లి అశోక్, ప్రశాంత్, రాజేందర్, శ్రావణ్, శివాజీ, మల్లేశ్, రామ్మూర్తి, లచ్చయ్య, చంద్రయ్య, గట్టయ్య, రాజా బాబు, సురేశ్ పాల్గొన్నారు.

పోచమ్మ ఎలనంపుడు కార్యక్రమం



శివారులో ముడుపులు కడుతున్న పూజారులు

ధర్మారం: మండల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న పోచమ్మ ఎలనంపుడు కార్యక్రమంలో భాగంగా శనివారం బైండ్ల పూజారుతో గ్రామ పొలిమేరలో గ్రామ నిర్బంధం ముడుపులు కట్టారు. గ్రామానికి నాలుగు దిక్కులా ఊరు శివార్లలో పూజారులు ముడుపులు కట్టారు. అయితే ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం పోచమ్మ పూజా కార్యక్రమాలు పూర్తయ్యే దాకా గ్రామ పొలిమేర విడిచి వెళ్లరాదనే నిబంధనలతో ఈ ముడుపులు కట్టారు. సర్పంచు పుస్కూరి జితేందర్ రావు, జెడ్పీటీసీ పద్మజ, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు పుస్కూరి రామారావు, వైస్ ఎంపీపీ మెడవేని తిరుపతి, ఎంపీటీసీ తుమ్మల రాంబాబు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు రఫీ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦భీమన్న చెరువు నిర్మాణానికి రూ.14.30కోట్ల నిధులు

ధర్మారం: మండలంలోని కానంపెల్లి గ్రామ శివారులోని భీమన్న చెరువు నిర్మాణానికి ప్రభుత్వం రూ.14.30కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసింది. మంత్రి కొప్పుల ఈశ్వర్ సిఫార్సు మేరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. నిధుల మంజూరుపై కానంపెల్లి, పైడిచింతలపల్లి రైతులు హర్షం వ్యక్తం చేశారు.

✦కొనసాగుతున్న మధ్యాహ్న భోజన వర్కర్ల సమ్మె

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద మధ్యాహ్న భోజనవర్కర్ల సమ్మె శనివారం కూడా కొనసాగింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని వర్కర్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ డిమాండ్ చేశారు.

✦రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు లేబర్ గేట్ రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోనగర్‌కు చెందిన ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఆటోనగర్‌కు చెందిన ఆరిఫ్ ట్యాంకర్ క్లీనర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రాజీవ్ రహదారి దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనగా గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

✦సమీకృత బాలుర వసతిగృహం సందర్శన

మంథని: మంథనిలోని సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహాన్ని శనివారం మంథని కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, వాడకం నీరు సక్రమంగా రావడం లేదని విద్యార్థులు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. టీపీసీసీ సభ్యుడు శశిభూషణ్ కాచే, మంథని మున్సిపల్ కౌన్సిలర్ పెండ్రు రమాదేవి, నాయకులు సెగ్గెం రాజేశ్, రావికంటి సతీశ్ ఉన్నారు.

✦కార్మికుల సమస్య పరిష్కారానికి కృషి

ఓదెల: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎంపీపీ కునారపు రేణుకదేవి పేర్కొన్నారు. ఓదెలలో శనివారం సమ్మెలో పాల్గొన్న కార్మికులు ఎంపీపీకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ ఆకుల మహేందర్, కార్మికులు చిటికేసి ప్రభాకర్, నాగయ్య, రాజు పాల్గొన్నారు.

✦మంత్రి వివాహ వార్షికోత్సవం

ధర్మారం: రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ వివాహ వార్షికోత్సవం శనివారం ధర్మారంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాసూరి శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు హాజరు కాగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

హెల్మెట్ పెట్టుకో.. ప్రాణాలు కాపాడుకో



అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

పెద్దపల్లిరూరల్: బైక్ నడిపే ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలంటూ పెద్దపల్లి ట్రినిటీ ఇంజనీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం పట్టణంలో అవగాహన కల్పించారు. అకడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్, ఎఎస్ఐ తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఎఓ సురేశ్, రాజిరెడ్డి, రాజేందర్, చొప్పరి వంశీ ఉన్నారు.

రెండురోజులు నీటి సరఫరా బంద్

మంథని: మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాలకు ఆది, సోమవారం మిషన్ భగీరథ నీటి సరఫరా ఉండదని గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పూర్ణచందర్ తెలిపారు. ప్రజలు సహకరించగలరని కోరారు.

'హిమాన్షు.. మా పాఠశాలను దత్తత తీసుకో'



ప్లకార్డులు చూపుతున్న విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: మౌలిక సదుపాయాలు లేని తమ పాఠశాలను సీఎం కేసీఆర్ మనవడు హిమాన్షు దత్తత తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ సమీపంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి మెంటం ఉదయ్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని, వంటశాలకు గదులు లేక ఆరుబయట వంటలు చేస్తున్నారన్నారు. దాదాపు 250 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలను సీఎం మనవడు దత్తత తీసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ నాయకులు శ్రీకాంత్, రోహిత్, నాని స్వరాజ్, వినోద్, వరుణ్, మణి, దినేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో బోనాల వేడుక



ముత్తారం కస్తూర్బాలో వేడుకలు



పెద్దపల్లిరూరల్: బోనం ఎత్తుకున్న విద్యార్థులు



గోదావరిఖనిటౌన్: బోనాలతో విద్యార్థినులు



యైటింక్లయిన్‌కాలనీ: పోతరాజుల వేషధారణలో..

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శాంతినికేతన్, బచ్‌పన్ పాఠశాలల్లో బోనాల పండుగ నిర్వహించారు. కరస్పాండెంట్ పాపిరెడ్డి, హెచ్ఎం నళిని శ్రీలక్ష్మి, రమాదేవి, సారయ్య పాల్గొన్నారు.

కస్తూర్బాలో..

కమాన్‌పూర్: ముత్తారంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బోనాల వేడుక నిర్వహించారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి కమల పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి బోనం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని పల్లవి మోడల్ స్కూల్‌లో శనివారం బోనాల ఉత్సవాలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు పట్టణంలోని ముత్యాలపోచమ్మ ఆలయంలో బోనం సమర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ శోభారాణి, ప్రిన్సిపాల్ వాణి పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో..

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని మార్కండేయకాలనీలోని నారాయణ పాఠశాలలో బోనాల పండుగ నిర్వహించారు. ఆర్అండ్‌డీ హెడ్ సంగీత, పాఠశాల ప్రిన్సిపాల్ రజినీ, ఈ–చాంప్స్ కోఆర్డినేటర్ వి.శ్రావణి, కిడ్స్ కోఆర్డినేటర్ రవళి ప్రియ, డీన్ ఆంజనేయులు, వైస్ ప్రిన్సిపాళ్లు సౌభాగ్య, రమాదేవి పాల్గొన్నారు.

వస్త్రమూట సహకార సంఘం అధ్యక్షుడిగా వీరస్వామి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే చందర్

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని వస్త్రమూట వ్యాపారుల సహకార సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా వంగ వీరస్వామి ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక దుర్గానగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నూతన కమిటీతో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రమాణ స్వీకారం చేయించారు. సహకార సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే చందర్‌తోపాటు అధ్యక్షుడిగా వంగ వీరస్వామి, ప్రధాన కార్యదర్శిగా ఆడెపు రాజమౌళి, సలహాదారులు శంకరయ్య, కోశాధికారిగా కందికట్ల సురేశ్, ఉపాధ్యక్షులుగా పిట్ట గట్టయ్య, గట్ల లక్ష్మణ్, అనిల్‌ను ఎన్నుకున్నారు. వస్త్రమూట వ్యాపారుల సహకార సంఘం కార్యాలయం ఏర్పాటుకు గుంట స్థలం ఇప్పించడంతోపాటు రూ.50వేల వరకు సబ్సిడీ, బ్యాంకు రుణాలు ఇప్పించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

పోచమ్మ ఉత్సవాలకు రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న జనార్దన్

ధర్మారం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న పోచమ్మ ఎలనంపుడు ఉత్సవాలకు ధర్మారం వన సంరక్షణ సమితి మాజీ చైర్మన్ దేవి జనార్దన్ రూ.100116 విరాళం శనివారం ఉత్సవ నిర్వాహకులకు అందించారు. నాయకులు సుతారి రామన్న, పాలకుర్తి రాజేశంగౌడ్, కాడె సూర్యనారాయణ, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కమాన్‌పూర్: ముత్తారం కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. విద్యార్థులను ఎస్‌వో కమల అభినందించారు.

'ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఊరుకోం'

గోదావరిఖని: రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌పై ఇష్టారాజ్యంగా మాట్లాడితే ఊరుకోబోమని 28వ డివిజన్ బీఆర్‌ఎస్ కార్పొరేటర్ పులీందర్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ కార్పొరేటర్ మహంకాళిస్వామి స్థాయిని మరిచి విమర్శలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు కొండ సురేశ్, పాయిల మల్లిక్, పల్లె ప్రభాకర్, పల్లె సారయ్య, నంది నగేష్, పల్లె రాజయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

మంథని: విద్యార్థులు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలని మంథని ఎస్సై మధుసూదన్‌రావు సూచించారు. మంథనిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత కళాశాలలో శనివారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొబైల్ వినియోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. అపరిచత వ్యక్తులు, సందేశాలకు సమాధానం ఇవ్వొద్దన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఝాన్సీ, అధ్యాపకులు ఉన్నారు.

ప్రధాన రోడ్డుకు మరమ్మతు



మరమ్మతు చేయిస్తున్న బీజేపీ నాయకులు

ఫెర్టిలైజర్‌సిటీ: పాలకుర్తి మండలం ఎఫ్‌సీఐ ఎల్కలపల్లిగేట్ నుంచి గుంటూరుపల్లి, ఎల్కలపల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పందించిన స్థానిక బీజేపీ నాయకులు శనివారం గుంతల రహదారికి మరమ్మతు చేయించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ పుట్టినరోజు సందర్భంగా రోడ్డుకు మరమ్మతు చేయించామని వారు తెలిపారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందుర్తి, మడక కనగర్తి గ్రామాల్లో ఏఎస్సై లక్ష్మరాజం ఆధ్వర్యంలో శనివారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో ఎలాంటి అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.